


**సైబర్ దునియా విస్తృతి పెరిగే కొద్దీ.. విశృంఖలత్వమూ పెచ్చరిల్లుతున్నది. మన అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని దాడులకు పాల్పడుతున్నారు ఫ్రాడ్‌స్టర్లు. మన బలహీనతలను వారి బలంగా మలుచుకుంటున్నారు. అత్యాశకు పోయే వారిని అమాంతం ముంచేస్తున్నారు. సందేశం రూపంలోనో, లింక్ ద్వారానో ఫోన్‌లో తల దూర్చి.. వినియోగదారుణ్ని ఏమార్చి పబ్బం గడుపు కొంటున్నారు. ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులు మాత్రం.. జరిగింది చెప్పుకోలేక, ఎవరికి చెప్పుకోవాలో తెలియక కుంగిపోతున్నారు. కంటికి కనిపించని ఆన్‌లైన్ శత్రువును మట్టికరిపించడం తేలికే. సైబర్ క్రైమ్ పోర్టల్‌లోకి ఎంటర్ అయితే చాలు.. ఈ మోసగాళ్ల భరతం ఇట్టే పట్టేయొచ్చు.**

# అస్త్రం 1930

ఆన్‌లైన్ మోసాల్లో చాలావరకు ఆడపిల్లలను టార్గెట్ చేసేవే ఉంటున్నాయి. చిన్న పిల్లలు, ఒంటరి మహిళలు లక్ష్యంగా.. సైబర్ కీచకులు వలపు వల విసురుతున్నారు. అసభ్యకరమైన వీడియోలు పంపడమో, చూపించడమో చేస్తూ వికృత ఆనందం పొందుతున్నారు. తెలిసీ తెలియక ఇలాంటి దుర్మార్గుల ఉచ్చులో చిక్కిన వాళ్లు.. పరువు పోతుందనే భయంతో మిన్నకుండిపోతున్నారు. ఈ నిర్లిప్తతే సైబర్ కేటుగాళ్లకు బలాన్నిస్తున్నది. 'మనల్ని ఎవరేం చేస్తారులే' అన్న ధైర్యాన్నిస్తున్నది. మీకు ఎదురైన చేదు అనుభవం మరెవరికీ ఎదురు కావొద్దంటే.. సైబర్ క్రైమ్‌ను సంప్రదించడమే పరిష్కారం. 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ఫోన్ సర్వీసు అందుబాటులో ఉంటుంది. https://www.cybercrime.gov.in వెబ్‌లింక్ ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చు.

**ఫిర్యాదు ఎలా?**

- పోర్టల్‌లోకి ఎంటర్ అయిన తర్వాత వ్యక్తిగత ఫోన్ నంబర్ ద్వారా రిజిస్టర్ అవ్వాలి.
- ఫిర్యాదు కేటగిరినీ తెలియపరచాలి (బాధితులు మహిళలో, చిన్నారులో తెలపాలి. చైల్డ్ పోర్నోగ్రఫీ, చైల్డ్ సెక్సువల్ అబ్యూస్ మెటీరియల్ చూపించడం, అసభ్యకరమైన కంటెంట్ షేర్ చేయడం)

పోర్నోగ్రఫీకి చెందినది కాకుండా.. ఇతర ఆన్‌లైన్ మోసాలకూ ఇక్కడే ఫిర్యాదు చేసే అవకాశం ఉంది.

- మొబైల్ క్రైమ్స్
- సోషల్ మీడియా క్రైమ్స్
- ఆన్‌లైన్ ఫైనాన్షియల్ ఫ్రాడ్స్
- సైబర్ ట్రాఫికింగ్
- రాన్సమ్‌వేర్ (మాల్వేర్ బాపతు దాడులు)
- హ్యాకింగ్

ఇలా ఎలాంటి మోసాలకు గురయ్యారో ఆప్షన్ ఎంచుకోవాల్సి ఉంటుంది.

జరిగిన మోసానికి సంబంధించిన స్క్రీన్ షాట్లు, లావాదేవీల స్టేట్‌మెంట్లు, ఫోన్‌కాల్ రికార్డింగులు ఏమైనా ఉంటే ఫిర్యాదుకు జతచేయడం మర్చిపోవద్దు.

**డబ్బు పోగొట్టుకుంటే..**

ఆన్‌లైన్ ఆర్థిక నేరాలను పరిష్కరించడానికి సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎమ్ఎస్) అందుబాటులో ఉంది. ఈ వ్యవస్థ ద్వారా సైబర్ నేరగాళ్లు లూటీ చేసిన సొమ్మును త్వరగా పొందే అవకాశాలూ కొంతవరకు ఉంటాయి. 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా జరిగిన నష్టాన్ని పూడ్చుకోలేకపోయినా, జరగబోయే అనర్థాన్ని ఆపొచ్చు. పోలీసులు, బ్యాంకు అధికారుల మధ్య వారధిగా ఈ వ్యవస్థ పనిచేస్తుంది. డబ్బు అందుకున్న ఖాతాను స్తంభింపజేస్తారు అధికారులు. ఫోన్ నంబర్ ద్వారా నేరగాళ్లను ట్రాక్ చేసి బాధితులకు న్యాయం చేస్తారు. ఫిర్యాదు చేసే సమయంలో దగ్గర ఉంచుకోవాల్సిన డాక్యుమెంట్లు ఇవి..

- డబ్బులు డెబిట్ అయిన ఖాతా వివరాలు
- బ్యాంకు స్టేట్‌మెంట్
- ట్రాన్సాక్షన్ ఐడీ
- ట్రాన్సాక్షన్ తేదీ




- ట్రాన్సాక్షన్ డెబిట్ కార్డు ద్వారా చేసినట్లయితే కార్డు వివరాలు
- ట్రాన్సాక్షన్‌కు సంబంధించిన స్క్రీన్‌షాట్/ ఎస్సెమ్మెస్/ వాట్సాప్ చాట్ వివరాలు

**ప్రాసెస్ ఇలా..**

- ఆన్‌లైన్‌లో ఆర్థిక మోసానికి గురైన బాధితుడు 1930 నంబర్‌కు ఫోన్ చేయగానే వ్యక్తిగత వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. వాటి ఆధారంగా బాధితుడి రాష్ట్రానికి చెందిన పోలీసులకు కనెక్ట్ చేస్తారు.
- జరిగిన మోసంతోపాటు పైన పేర్కొన్న వివరాలన్నీ చెప్పాలి. ఖాతాను ధ్రువీకరించిన తర్వాత పోలీసుల నుంచి సదరు అకౌంట్ ఉన్న బ్యాంకుకు సమాచారం అందుతుంది.
- ఫిర్యాదు అందుకున్న తర్వాత.. బాధితుడికి అక్నాలెడ్జ్‌మెంట్ వస్తుంది. జరిగిన ఫ్రాడ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు పోర్టల్‌లో అప్‌డేట్ చేస్తారు.
- బాధితుడు తెలిపిన వివరాల ఆధారంగా అధికారులు జరిగిన మోసానికి సంబంధించిన పూర్వాపరాలు తెలుసుకుంటారు. మరోవైపు బ్యాంకు ద్వారా నిందితుడి ఖాతా వివరాలు తెలుసుకుని, దానిని స్తంభింపజేస్తారు. నేరానికి సంబంధించిన సమాచారం సేకరించిన తర్వాత బాధితుణ్ని పిలిపిస్తారు. సంబంధిత కోర్టులో బాధితుడి ద్వారా దరఖాస్తు చేయిస్తారు. తర్వాతి స్టేజ్‌లో కోర్టు ఆదేశాల మేరకు నిందితుడి ఖాతా నుంచి బాధితుడికి పోలీసులు తిరిగి డబ్బు ఇప్పిస్తారు. ■



**అనిల్ రాచమల్ల**
వ్యవస్థాపకులు
ఎండ్‌నౌ ఫౌండేషన్